క్లుప్తంగా

కలెక్టర్‌కు మొక్క అందజేసిన మేయర్



కలెక్టర్‌కు మొక్క ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న మేయర్, మాజీ డిప్యూటీ సీఎం

కడప కార్పొరేషన్: వైఎస్సార్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన చెరుకూరి శ్రీధర్‌కు కడప మేయర్ కె.సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో ఆయనను కలిసి మొక్క అందజేసి స్వాగతం పలికారు.

క్రీడా మైదానం పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మైదానాన్ని ఎమ్మెల్యే ఆర్.మాధవీరెడ్డి శుక్రవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలోని క్రీడాకారులకు అవసరమైన ఉత్తమ క్రీడా మైదానంగా డీఎస్ఏ స్టేడియం తీర్చిదిద్దుతామన్నారు. నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి, డీఎస్‌డీఓ కె. జగన్నాథరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసరెడ్డి, శ్రవణ్‌రాజ్‌రెడ్డి, కోచ్‌లు పాల్గొన్నారు.

వైవీయూలో స్వచ్ఛత కార్యక్రమం

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయంలోని సీవీ.రామన్ ప్రాంగణం పరిసరాలలో శుక్రవారం స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. వైవీయూ జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కె.లలిత , డాక్టర్ సునీత ఆధ్వర్యంలో వాలంటీర్లు పరిసరాలను శుభ్రం చేశారు. వైవీయూ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.ఎన్.వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

స్విమింగ్‌లో రజతం



షేక్ అలీ అమీనాను రజత పతకంతో అభినందిస్తున్న డీన్ చంద్రకిశోర్‌రెడ్డి, సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న షేక్ అలీ అమీనా రాష్ట్ర స్థాయి అండర్–19 స్విమింగ్ వంద మీటర్ల బ్యాక్ స్ట్రోక్ పోటీలలో రజతం సాధించిందని ప్రిన్సిపల్ వెంకటస్వామి తెలిపారు. షేక్ అలీ అమీనాకు నారాయణ కళాశాలల డీజీఎం రామ్మోహన్‌రెడ్డి, డీన్ చంద్రకిశోర్‌రెడ్డి, ఏజీఎం చెన్నక్రిష్ణారెడ్డిలతోపాటు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

అభివృద్ధి పనులు వేగవంతం



మాసాపేట సర్కిల్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: కడప నగరంలో అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆదేశించారు. మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఎన్టీఆర్ సర్కిల్, మాసాపేట సర్కిల్ ప్రాంతాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద చెత్త స్వీకరణ, స్వీపింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మాసాపేట సర్కిల్ వద్ద లైటింగ్ పనులు త్వరగా చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు చెత్త సేకరించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పాలక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కడప కార్పొరేషన్: కడప నగరంలో విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణలో భాగంగా ఈ నెల 9న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కడప డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరి సేవ్యా నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలోని ఎం.ముత్రాస్‌పల్లి, రెడ్డికాలనీ, పక్కీరుపల్లి, ఓం శాంతినగర్, అబ్దుల్ కలాం కాలనీ, చిన్న చౌక్, విద్యా మందిర్ స్కూల్, భాగ్యనగర్ కాలనీ, దేవుని కడప, గౌస్ నగర్, నిర్మల స్కూల్, మాచుపల్లి రోడ్డు, మాసాపేట, నమస్తే బోర్డు, భారతి భార్, ద్వారకా నగర్, సంధ్యా సర్కిల్, ఎర్రముక్కపల్లి, సీపీబ్రౌన్, మున్సిపల్ ఆఫీసు, ఆర్టీసీ బస్టాండు, పటేల్ రోడ్డు, అరవింద్ నగర్, తేజ పెట్రోల్ బంకు ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మహిళకు గాయాలు

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగరంలోని ఐటీఐ సర్కిల్ సమీపంలో హారా ఎలక్ట్రిక్ బైకులో వెళుతుండగా వెనుకవైపు నుంచి టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో హాజిరా గాయాలు కావడంతో రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ తెలియజేశారు.

సాగులో సహకరిస్తూ.. శిక్షణలో రాణిస్తూ

పంటల సాగులో సూచనలు, సలహాలిస్తూ క్షేత్ర స్థాయిలో రైతులతో మమేకమవుతున్నారు. వ్యవసాయంపై అవగాహన పొందుతూ వారితో కలిసి నడుస్తున్నారు. వారు అధికారులంటే కాదు.. వ్యవసాయ కళాశాల విద్యార్థులు. చదువు ముగిసినప్పటి నుంచి శిక్షణలో భాగంగా రైతుకు సేవలందించడమే లక్ష్యంగా అడుగులు వేస్తూ.. వారికి వెన్నుదన్నుగా నిలుస్తున్నారు.



తాడిగొట్లలో వరినాట్లు వేస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు



కందిపంటలో కలుపు తీస్తూ

- క్షేత్ర స్థాయిలో రైతన్నలకు తోడు నీడగా
- ఒకే గ్రామంలో రైతులతో కలిసి శిక్షణ

కడప అగ్రికల్చర్: ప్రతి నిత్యం రైతులు పొలంలో చేసే వ్యవసాయ పనులు, పంటల సాగు, నిర్వహణ, తెగుళ్ల పరిశీలన, ఎరువుల యాజమాన్యంపై రైతులతో కలిసి పనిచేస్తూ వారి ద్వారా మెలకువలు తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారు విద్యార్థులు. శాస్త్రవేత్తల దృష్టికి సమస్యలను(తెగుళ్లు, ఎరువులు) తీసుకెళ్లి పరిష్కరిస్తూ తమ శిక్షణ కొనసాగిస్తున్నారు. నంద్యాల జిల్లా మహానంది వ్యవసాయ కళాశాల విద్యార్థులు. గ్రామీణ ఔత్సాహిక అవగాహన అభివృద్ధి యోజన కార్యక్రమంలో భాగంగా మూడు నెలల శిక్షణ కోసం వైఎస్సార్ జిల్లాకు వచ్చారు. కడప ఊటకూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 18 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. ఆరుగురు విద్యార్థులు ఒక బ్యాచ్‌గా.. మొత్తం మూడు బ్యాచ్‌లు తాడిగొట్ల, ఇప్పెంట, సికె.దిన్నె గ్రామాల పొలాలకు వెళ్లి రైతులతో కలిసి వివరాలు తెలుసుకుంటున్నారు. పంటల సాగు చేసే అభ్యుదయ రైతులతో(ప్రతి రోజు ఒక రైతుతో) కలిసి నిత్యం క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్తూ కొత్త విషయాలు గ్రహిస్తున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయంపై వారి అభిప్రాయాలను ఇలా వ్యక్తం చేశారు.

రైతు కష్టం ఇలా ఉంటుందా..



రైతులతో కలిసి పొలాలకు వెళ్లి వారితో పంటల సాగులో మెలకువలు తెలుసుకున్నాం. వారు పడే కష్టాలు పరిశీలిస్తుంటే వ్యవసాయ రంగంపై పూర్తి అవగాహన కలుగుతోంది. రైతుల కష్టాలు ఇలా ఉంటాయని తెలిసింది. వారి అభివృద్ధికి సూచనలిస్తూ శిక్షణ కొనసాగిస్తున్నాం. – శ్రేయాపటేల్, కామారెడ్డి, తెలంగాణ

క్షేత్ర స్థాయిలో అభ్యసన



ఇన్ని రోజులు మేము పుస్తకాల్లోని అంశాలనే తెలుసుకొన్నాం. క్షేత్ర స్థాయిలో ఎన్నో విషయాలు అభ్యసించగలుగుతున్నాం. వరి అంటే ఇలా, వేరుశనగ అంటే ఇలా అనుకోవడమే తప్ప ప్రాక్టికల్‌గా చేస్తే గానీ తెలియలేదు. ఈ క్షేత్ర స్థాయి పరిశీలనతో మాకు అన్నీ తెలిసివచ్చాయి. – వైష్ణవి, ఎమ్మిగనూరు, కర్నూలు

తల్లిదండ్రుల కష్టాలు కళ్లకు కట్టినట్లుగా



మేము క్షేత్ర స్థాయి పరిశీలనకు వస్తే గానీ మా తల్లితండ్రులకు ఇన్ని కష్టాలు ఉంటాయని తెలియ రాలేదు. ఈ కష్టాలను చూసిన తర్వాత మరింత కష్టపడి చదవాలనే కసి మాలో పెరుగుతోంది. వ్యవసాయంపై పూర్తి అవగాహన పొంది రైతుల కోసం కృషి చేయాలనుకుంటున్నా. – అరవిందరెడ్డి, జడ్చర్ల, తెలంగాణ

సీనియర్ కమ్యూనిస్టు నేత అస్తమయం



లింగమూర్తి (ఫైల్)

కడప సెవెన్‌రోడ్స్ : సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు కె.లింగమూర్తి(84) శుక్రవారం సాయంత్రం నగరంలోని కుమార్తె ఇంటిలో మృతిచెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇంతలోనే తీవ్రమైన గుండె పోటు రావడంతో మరణించారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. శనివారం స్వామి నగర్‌లో ఆయన అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అందరూ లింగమూర్తి అన్నగా పిలిచే ఆయన స్వగ్రామం పులివెందుల నియోజకవర్గంలోని లింగాల. భూస్వామ్య కుటుంబం నుంచి వచ్చిన ఆయన ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎంవీ.రమణారెడ్డితో కలిసి విజయవాడ లయోల కళాశాలలో చదువుకున్నారు. అక్కడే డిగ్రీ పూర్తిచేశారు. విద్యార్థి దశలోనే వామపక్ష రాజకీయాలవైపు ఆకర్షితులై సీపీఐలో చాలా ఏళ్లు పనిచేశారు. ఆలిండియా కిసాన్ సభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేసి జిల్లాలో రైతు ఉద్యమాలను నిర్వహించారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడిగా, తన కళారూపాల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించే కార్యక్రమాలను నిర్వహించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి, డాక్టర్ ఎంవీ.మైసూరారెడ్డిల సరసన పనిచేశారు. సుమారు 50ఏళ్లకు పైబడే కమ్యూనిస్టు పార్టీలో ఆయన సేవలందించారు. ఆయన పార్థివ దేహానికి ప్రముఖులు నివాళులర్పించారు.

దిగ్భ్రాంతి కలిగించింది

సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు లింగమూర్తి మృతి తనకు దిగ్భ్రాంతి కలిగించిందని సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి, ఏఐటీయూసీ మాజీ రాష్ట్ర కార్యదర్శి టి.లక్ష్మినారాయణ అన్నారు. రాయలసీమ ప్రాంతంలో గుర్తింపుగల సీనియర్ నాయకుడు అన్నారు.

కమ్యూనిస్టు ఉద్యమంలో కీలకపాత్ర

లింగమూర్తి మృతదేహాన్ని సందర్శించి సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ నివాళులర్పించారు. కమ్యూనిస్టు ఉద్యమంలో ఆయన కీలకపాత్ర పోషించారని, ధనికవర్గంలో పుట్టినా పేదల కోసం తన జీవితాన్ని ధారబోశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మనోహర్, రామ్మోహన్, దస్తగిరి రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

సీపీఐ నేతల నివాళి

కడప సెవెన్‌రోడ్స్: లింగమూర్తి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఆ పార్టీ నగర కార్యదర్శి ఎన్. వెంకట శివ, పులి కృష్ణమూర్తి, మనోహర్‌రెడ్డి, ఫక్ృద్దీన్, చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లింగమూర్తికి మాజీ డిప్యూటీ సీఎం నివాళి



లింగమూర్తికి నివాళులర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా

కడప సెవెన్‌రోడ్స్: రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నేత లింగమూర్తి సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. శుక్రవారం రాత్రి లింగమూర్తి మృత దేహానికి ఆయన ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ఆయన మృతి తీరని లోటు

కడప సెవెన్‌రోడ్స్ : గ్రామీణ భూస్వామ్య కుటుంబంలో పుట్టి కమ్యూనిస్టుగా విలువలకు కట్టుబడి జీవితాంతం పనిచేసిన కమ్యూనిస్టు నేత లింగమూర్తి మృతి తీరని లోటని నగరానికి చెందిన రఘునాథరెడ్డి తెలిపారు. శుక్రవారం లింగమూర్తి మృతదేహానికి ఆయన నివాళులర్పించి కుటుంబ సభ్యులకు తమ సంతాపాన్నివ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామన్నారు.

దళితులపై పోలీసుల చిన్నచూపు

దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం నాయకుల ఆగ్రహం



మాట్లాడుతున్న ఆర్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు బాల చెన్నయ్య, తదితరులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కరించకుండా దళితులను పోలీసులు చిన్న చూపు చూస్తున్నారని దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం గౌరవాధ్యక్షుడు బాల చెన్నయ్య, మడగలం ప్రసాద్, విజయకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ పెండ్లిమర్రి మండలం గంగనపల్లెలో ఓబుల సుబ్బరాయుడుకు చెందిన రూ.70 వేల పాడి గేదెను పాత కడపకు చెందిన మోపూరి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సోదరులు దౌర్జన్యంగా తరలించుకుకపోయారని ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదన్నారు. న్యాయం చేయాల్సిన పోలీసులు అధికారం కలిగిన వారికే సహకరించడ న్యాయం కాదన్నారు. సమస్యను పరిష్కరించకపోతే దళిత కుటుంబాలతో కలిసి చలో చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : మౌలానా అజాద్ జయంతి సందర్భంగా కడప నగర శివారులోని మను పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో మౌలానా అజాద్ జీవిత చరిత్రపై శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కడప నగరంలోని పలు ప్రభుత్వ మరియు ప్రైవేటు ఉర్దూ పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. మను పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మీర్జావిలాయత్ అలీ బైగ్, కో ఆర్డినేటర్ డాక్టర్ హకీముద్దీన్ మాట్లాడుతూ విద్యార్థులలో దేశభక్తి, పెంపొందేలా ఈ పోటీలు నిర్వహించామన్నారు. మౌలానా అజాద్ విద్యార్థులకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచారన్నారు. విజేతలకు కడప మను పాలిటెక్నిక్ కళాశాలలో బహుమతులు అందజేస్తామని తెలిపారు. కన్వీనర్ మహమ్మద్ సికిందర్ హుస్సేన్, విద్యార్థులు తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న సంస్థ ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో హిమ వర్షిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కర్నూలుకు చెందిన కాలకూర కృష్ణమూర్తి వర్ధంతి సందర్భంగా ఆయన సతీమణి పార్వతమ్మ, కుమారులు ప్రణీత్‌కుమార్, శ్రావణ్ కుమార్ పేదలకు అన్నదానం చేశారు. ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, రిటైర్డ్ ఆర్టీసీ డీఎం నాగుల రాంప్రసాద్ మాట్లాడుతూ వృద్ధుల ఆకలి తీర్చడం పుణ్యకార్యమన్నారు. దాతలు ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వారి అవసరాలు తీర్చినట్లవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రెడ్డి లక్ష్మణ్, దామోదర్, టైలర్ రవి, మధు పాల్గొన్నారు.

మహిళలపై వివక్ష చూపవద్దు

వైవీయూ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి



న్యాయవాది వసుధ నాగరాజ్‌ను సన్మానిస్తున్న వైవీయూ అధికారులు

వైవీయూ : మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు.. వారిపై వివక్ష చూపకుండా సమానావకాశాలు కల్పిస్తే దేశానికి పేరు, ప్రఖ్యాతులు తీసుకువస్తారని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. వైవీయూలోని మొల్ల సమావేశ మందిరంలో మహిళలపై హింసపై సామాజిక, చట్టపరమైన అవగాహన అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి వీసీ మాట్లాడుతూ లింగ వివక్షత నిర్మూలించేందుకు ప్రయత్నం చేయాలని కోరారు. రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ మాట్లాడుతూ బాల్య దశ నుంచే సమానత్వాన్ని పిల్లల మధ్య అలవాటు చేయాలన్నారు. మహిళల రక్షణ కోసం చట్టాలు వచ్చాయని, వాటిపై అవగాహన పెరగాలన్నారు. ప్రిన్సిపల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ ప్రతి రోజూ పత్రికలలో మహిళలపై జరుగుతున్న హింసను చూస్తున్నామని, ఆ పరిస్థితి నుంచి మార్పు కోసం విద్యార్థులే సమాజాన్ని చైతన్యం చేయాలన్నారు. న్యాయవాది వసుధా నాగరాజ్ మాట్లాడుతూ అత్యంత పేద వర్గాలు న్యాయస్థానం తలుపులు తట్టిన సందర్భాలు గుర్తు చేసుకుని విద్యార్థినులు నిశ్శబ్దాన్ని వీడాలన్నారు. అనంతరం వసుధ నాగరాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఎంఎం.వినోదిని, డాక్టర్ పివి.వరప్రభాకర్, ఎం.మమతకుమారి, డాక్టర్ గణేష్‌నాయక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

14న కలెక్టరేట్ ఎదుట మహాధర్నా



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : విద్యుత్తు ఛార్జీల పెంపును వ్యతిరేకిస్తూ ఈ నెల 14న కడప కలెక్టరేట్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ తెలిపారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో మహా ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సామాన్య పేద, మధ్య తరగతి ప్రజలపై దాదాపు రూ.18వేల కోట్ల రూపాయల భారం మోపిందన్నారు కడప జిల్లాలో కరవు మండలం ప్రకటించక పోవడం అన్యాయమని తెలిపారు. విద్యుత్ ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో భారం మోపడం చాలా దుర్మార్గమన్నారు. విభజన హామీల కోసం ఎన్‌డీఏ ప్రభుత్వంపై తెలుగుదేశం ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులకు నిధుల కేటాయించి పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.రామ్మోహన్, బి.మనోహర్, ఐఎన్.సుబ్బమ్మ, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

18న గ్రామ సచివాలయాల వద్ద నిరసన



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : పేదలకు మూడు సెంట్ల ఇళ్లస్థలం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న గ్రామ సచివాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఆందోళనకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, సిమెంట్, ఇసుక, ఇనుము, ఇటుక, కంకర ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలని కోరారు. గృహ నిర్మాణానికి అనువైన ప్రాంతాలను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.వెంకటశివ, సుబ్రహ్మణ్యం, వి.వీరశేఖర్, జి.వేణుగోపాల్, కేసీ.బాదుల్లా, జి మద్దిలేటి, పి.మల్లికార్జున, లింగన్న, వలరాజు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల షెడ్యూల్ అమలుచేయండి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్ : మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతుల షెడ్యూల్ అమలులో ఆలస్యం జరుగుతోందని ఎస్‌టీయూ కడప జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాషా, సంగమేశ్వర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంభం బాలగంగారెడ్డి అన్నారు. డీఈఓ మీనాక్షిని వారు ఆమె కార్యాలయంలో కలిసి శుక్రవారం వినతిపత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుల తుది సీనియారిటీ జాబితా విడుదల చేసి పదోన్నతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు రెసిడెన్షియల్ విధానంలో కాకుండా నాన్ రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ తరగతులు నిర్వహించాలని డీఈఓను కోరారు. అపార్ నమోదు ప్రక్రియకునిర్విరామంగా కృషి చేస్తున్న ఎమ్మార్సీ స్టాఫ్, సమగ్ర శిక్ష ఉద్యోగులకు వెంటనే అక్టోబర్ నెల వేతనాలు విడుదల చేయాలని కోరారు. డీఈఓ స్పందిస్తూ శనివారం నాటికి ఫైనల్ సీనియారిటీ లిస్ట్ విడుదల చేస్తామని, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌తోపాటు పదోన్నతులు చేపడతామని తెలిపారు.

పరిశోధనల వైపు విద్యార్థులు దృష్టిసారించాలి



డీబీటీ స్టార్ స్టేటస్ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

వైవీయూ : విద్యార్థులు చదువుతోపాటు పరిశోధనల వైపు దృష్టి సారించాలని వైవీయూ వృక్ష శాస్త్ర ఆచార్యులు డాక్టర్ ఎ.మధుసూధన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో నిర్వహిస్తున్న డీబీటీ స్టార్ స్టేటస్ కార్యక్రమంలో శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులు.. రేపటి పరిశోధకులు, శాస్త్రవేత్తలుగా రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం ఔషధ మొక్కలు, తూర్పు కనుమల్లో లభించే అరుదైన, అంతరించి పోయే మొక్కల జాతుల గురించి ఆయన వివరించారు. ప్రిన్సిపల్ డా.జి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ కార్యక్రమం విజయవంతంగా సాగుతోందని, అనంతరం అతిథిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.ఎం.రమేష్, అధ్యాపకులు డాక్టర్ ఆర్.నీలయ్య, రాజశేఖరరెడ్డి, సురేష్‌బాబు, తిలక్ విద్యాసాగర్, శివరామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫార్మసీ యాక్టు అమలుచేయాలి

– రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సురేష్ బాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.సురేష్ బాబు

కడప కార్పొరేషన్: రాష్ట్రంలో ఫార్మసీ యాక్టు–1948ని అమలు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ ఫార్మసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల సురేష్‌బాబు, రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ రాధాక్రిష్ణ కోరారు. స్థానిక జిల్లా కెమిస్ట్ భవన్‌లో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫార్మసిస్టుల ఉపాధి కోసం పోరాడడమే సంఘం ముఖ్య లక్ష్యమన్నారు. సంవత్సరానికి దాదాపు 40 వేల మంది బయటికి వస్తున్నారని, వారందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఫార్మసీ చట్ట ప్రకారం ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్‌కు ఎన్నికలు నిర్వహించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 8వేల రెన్యువల్స్ పూర్తి చేయాలన్నారు. ఫార్మసిస్టులు తమ సర్టిఫికెట్లు రెంట్‌కు ఇవ్వకుండా మెడికల్ స్టోర్ పెట్టాలనుకున్న ప్రతి ఫార్మసిస్టుకు కనీసం రూ.5 లక్షల రాయితీతో కూడిన రుణాలివ్వాలన్నారు. మందుల తయారీ కంపెనీల్లో 80 శాతం ఫార్మసిస్టలకు ఉద్యోగాలిచ్చేలా ప్రణాళిక చేసి ఉద్యోగాలు ఇప్పించాలన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిగా రాధాక్రిష్ణ, ప్రధాన కార్యదర్శిగా చలపతి, వైస్ ప్రెసిడెంట్లుగా సుబ్బరాయుడు,, నాగ సుధాకర్, ట్రెజరర్‌గా ఇ.సుబ్బారాయుడు, తదితరులను ఎన్నుకున్నారు. సుబ్బారెడ్డి, అనిల్, భార్గవరెడ్డి, జనార్దన్, బాలక్రిష్ణ, ఉమామహేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నేటి నుంచి పద్య పఠన పోటీలు

కడప కల్చరల్: కడప రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం నుంచి విద్యార్థులకు పద్య పఠన పోటీలు నిర్వహిస్తున్నట్లు రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ రెడ్డి సేవా సమితి కడప రజతోత్సవాల సందర్భంగా 15ఏళ్ల బాలలకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 130 పాఠశాలల నుంచి 1300మంది పాల్గొంటున్నారని వివరించారు. కడప నుంచి 566, ప్రొద్దుటూరులో 472, రాజంపేటలో 303 మంది పేర్లను నమోదు చేసుకున్నారని, న్యాయ నిర్ణేతలుగా 26 మందిని నియమించామని తెలిపారు. ప్రొద్దుటూరులోని జార్జి క్లబ్‌లో శనివారం, రాజంపేట మన్నూరు జెడ్పీ పాఠశాలలో ఆదివారం, కడప నగరంలోని రెడ్డి సేవా సమితి కార్యాలయంలో ఈ నెల 17న ఉదయం 9 గంటలకు పోటీలు ఉంటాయన్నారు. భోజనం, తదితర ఏర్పాట్ల కోసం విద్యార్థుల వివరాలను ఈ నెల 31వ తేదీలోగా పంపాలని సూచించారు. దరఖాస్తులో తప్పనిసరిగా ఫోన్ నెంబర్ ఇవ్వాలన్నారు.

15న జ్వాలాతోరణ ఉత్సవం

కడప కల్చరల్: పుష్పగిరి తీర్థ క్షేత్ర ధర్మ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 15న కార్తిక పౌర్ణమి సందర్భంగా పుష్పగిరి పుణ్య, పర్యాటక క్షేత్రంలో జ్వాల తోరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు సట్టి భారవి తెలిపారు. సాయంత్రం 6.15 గంటలకు బ్రహ్మంగారిమఠం అచలానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీ విరజానంద స్వామి ముఖ్య అతిథిగా హాజరై జ్వాలా తోరణ ప్రజ్వలనం చేస్తారన్నారు.

గ్రంథాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ పి.శ్రీనివాసులు

కడప కల్చరల్: గ్రంథాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, జేఏసీ చైర్మెన్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. కడప యూటీఎఫ్ భవన్‌లో శుక్రవారం రాయలసీమ ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యోగులకు 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించేలా చూస్తామన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉచితంగా రీడింగ్ హాల్స్ ఏర్పాటు చేయాలని, కొత్త పుస్తకాలు అందుబాటులో ఉంచాలని తెలియజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ నిరుద్యోగులకు నిరంతరం అందుబాటులో ఉండాలంటే ఖాళీగా వున్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు, గ్రంథాలయ ఉద్యోగుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాదెండ్ల బాబ్జి మాట్లాడుతూ గ్రంథాలయ సంస్థలో నియామకాలు, పదోన్నతులు లేక చాలీచాలని సిబ్బందితో విధులు నిర్వర్తించడం ఇబ్బందిగా ఉందన్నారు. అనంతరం పలు అంశాలపై చర్చించి, తీర్మానాలను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి అలీ, పి.కమ్మన్న, శ్రీనివాసులు, జయరాం నాగమణి, కడప, అనంతపురం, కర్నూలు, చిత్తూరు, నెల్లూరు జిల్లాల నుంచి అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.